సాక్షి
మహబూబాబాద్

సోమవారం । 20 । ఫిబ్రవరి । 2023



కొనసాగుతున్న దేహదారుఢ్య పరీక్షలు

కేయూ లోని మైదానంలో పోలీస్ కానిస్టేబుల్, సబ్ ఇన్‌స్పెక్టర్ల నియామకాలకు దేహ దారుఢ్య పరీక్షలు కొనసాగుతున్నాయి.

- 8లో▸



ఆలోచనల ఆవిష్కరణ

ఇంక్యుబేషన్ సెంటర్‌లా నూతన ఆవిష్కరణలకు, స్కిల్ డెవలప్‌మెంట్‌కు నిట్ సెంటర్ ఫర్ ఎక్సలెన్సీ భవనంలోని సీమెన్స్ సంస్థ తోడ్పాటునందిస్తోంది.

- 8లో▸

గరిష్టం/కనిష్టం
34.8^0 / 18.6^0

వాతావరణం

జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. కాస్త చలిగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండతో పాటు ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

ఆర్టీసీ మానుకోట డిపో ఆదాయం రూ.1,52,068

నెహ్రూసెంటర్: మహాశివరాత్రి సందర్భంగా కురవి జాతరకు ఆర్టీసీ మానుకోట డిపో నుంచి రెగ్యులర్ బస్సులతో పాటు ప్రత్యేకంగా బస్సులు నడిపారు. ఈ మేరకు డిపోకు రూ.1,52,068 ఆదాయం సమకూరినట్లు మేనేజర్ విజయ్ ఆదివారం వెల్లడించారు. సురక్షిత ప్రయాణాల కోసం ఆర్టీసీ బస్సుల్లోనే ప్రయాణం చేయాలని ఆయన సూచించారు.

కోరమీసాల బహూకరణ



కురవి: మండల కేంద్రంలోని వీరభద్రస్వామి వారికి హైదరాబాద్‌కు చెందిన భక్తుడు డాక్టర్ మార్గం విజయ్‌పటేల్,సౌజన్య, లక్ష్మపటేల్, త్రినాయినిపటేల్ రెండు బంగారు కోరమీసాలు, రెండు బంగారు కల్యాణబొట్టు బిళ్లలు ఆదివారం ఆలయ ఈఓ సత్యనారయణ, చైర్మన్ బాదావత్ రామునాయక్‌లకు బహూకరించారు. అలాగే స్వామివారి మూలవిరాట్టుకు గాలి విసిరేందుకు రెండు వింజామరలను అందజేశారు. స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు.

వైద్య సిబ్బందికి అభినందన

మహబూబాబాద్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రిలో 24 గంటల్లో 19 కాన్పులు చేశారు. ఇదులో 15మందికి నార్మల్ డెలివరీలు చేసిన వైద్య సిబ్బందిని మంత్రి సత్యవతి రాథోడ్ ఆదివారం ఒక ప్రకటనలో అభినందించారు. ఈనెల 17వ తేదీ ఉదయం 8గంటల నుంచి 18వ తేదీ ఉదయం 8గంటల వరకు 19 కాన్పులు చేశారు. 15 మందికి నార్మల్ డెలివరీలు చేయగా.. మరో నలుగురికి తప్పనిసరి పరిస్థితుల్లో సిజేరియన్ చేసినట్లు వైద్యులు తెలిపారు.

వలస కూలీల పడిగాపులు..



డోర్నకల్: బల్లార్షా మార్గంలో రైళ్ల రద్దుతో వలస కూలీలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తమ సొంత గ్రామాలకు వెళ్లేందుకు డోర్నకల్, మహబూబాబాద్ రైల్వేస్టేషన్లలో మహారాష్ట్రకు చెందిన వలస కూలీలు రైళ్ల కోసం ఎదురు చూస్తున్నారు. గత డిసెంబర్ మొదటి వారం నుంచి మిరప తోటల్లో కాయకోత పనుల కోసం మహారాష్ట్ర నుంచి అధిక సంఖ్యలో కూలీలు రైళ్లు, ప్రైవేటు వాహనాల ద్వారా డోర్నకల్‌కు చేరుకుని ఇక్కడి నుంచి గ్రామాల్లోని రైతుల మిరప తోటలకు వెళ్లారు. పనులు ముగిసిన తర్వాత ఇళ్లకు బయలుదేరిన కూలీలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కాజీపేట, బల్లార్షా మార్గంలో విరూర్, మకోడి రైల్వే స్టేషన్ల మధ్య కొనసాగుతున్న మూడో రైలు లైన్ నిర్మాణ పనుల్లో భాగంగా ఈ నెల 15 నుంచి 25వ తేదీ వరకు పలు రైళ్లను రద్దు చేశారు. దీంతో వలస కూలీలు ఇబ్బందులు ఎదుర్కుంటున్నారు.

మాదిగలను మోసం చేస్తున్న బీజేపీ

- ఎంఎస్‌పీ జాతీయ అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ

నయీంనగర్: బీజేపీ.. ప్రతి అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో వర్గీకరణకు అనుకూలంగా హామీలిస్తూ ఆ తరువాత మోసం చేస్తున్నట్లు స్పష్టమవుతోందని మహాజన సోషలిస్ట్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ అన్నారు. ఆదివారం హనుమకొండ హరిత హోటల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా అప్పటి యూపీఏ ప్రభుత్వానికి బీజేపీ లేఖలు రాసి తాము అధికారంలోకి రాగానే 100 రోజుల్లో వర్గీకరణ చేస్తామని ఇప్పటి వరకు చేయలేదన్నారు. బిల్లు పెట్టకపోతే బీజేపీకి వ్యతిరేకంగా ముందుకెళ్తామన్నారు. దేశంలో ఆ పార్టీకి వ్యతిరేఖంగా పనిచేస్తున్న వారితో కలిసి బీజేపీ ఓటమికి పనిచేస్తామన్నారు. తెలంగాణలో మాదిగలకు లేని భరోసాను ప్రజలకు ఎలా ఇస్తారని ప్రశ్నించారు. భరోసా యాత్ర పేరును మభ్యపెట్టే యాత్ర అంటే బాగుంటుందన్నారు. రాష్ట్రంలో అనాథలకు గురుకులాలు, రిజర్వేషన్లు ఏర్పాటు చేస్తే దేశానికే రాష్ట్రం ఆదర్శమవుతుందన్నారు. దళితబంధు రాజకీయ నాయకుడుకి రాజకీయ లబ్ధి చూకూర్చే పథకమన్నారు. ఇది ఎమ్మెల్యేల బంధువుగా మారిందని, లబ్ధిదారుల ఎంపికలో అవినీతికి ఎవరిది బాధ్యత అని ప్రశ్నించారు. ఎంఎస్‌పీ రాష్ట్ర అధ్యక్షుడు తీగల ప్రదీప్ గౌడ్, ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జ్ మంద కుమార్ మాదిగ, సుకుమార్ మాదిగ పాల్గొన్నారు.

తెరపైకి మరో ఆర్వోబీ

- డిజైన్ తయారీతో పనుల్లో కదలిక
- రైల్వే నుంచి అనుమతులు జారీ
- ఏ క్యాబిన్ సమీపంలో ఏర్పాటు
- బ్రిడ్జికి రెండువైపులా కలిపి కిలోమీటరు నిర్మాణం
- రూ.80నుంచి రూ.100కోట్లు అవసరం



ఆర్వోబీ నిర్మాణం చేసే ప్రాంతం ఇదే..

మహబూబాబాద్: జిల్లా కేంద్రంలో ఇప్పటికే ఆర్వోబీ ఉండగా.. పట్టణ శివారు ఏ క్యాబిన్ సమీపంలో మరో బ్రిడ్జి నిర్మాణం చేపట్టనున్నారు. కొన్నేళ్ల క్రితం మంజూరైన ఆర్వోబీ నిర్మాణం మళ్లీ తెరపైకి వచ్చింది. ఇటీవల రైల్వే శాఖ నుంచి క్లియరెన్స్ రాగా సంబంధిత అధికారులు డిజైన్ తయారీ చేసి సర్వే పనులు పూర్తి చేశారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు తదుపరి చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. కాగా ఈ బ్రిడ్జి నిర్మాణం పూర్తయితే మానుకోట పట్టణంలో ట్రాఫిక్ సమస్య కొంతమేర తీరనుంది.

కాంగ్రెస్ హయాంలో మంజూరు..

కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలోనే మానుకోట పట్టణ శివారులో ఆర్వోబీ మంజూరైంది. అప్పుడు రూ.55కోట్లు మంజూరు చేశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు తర్వాత బ్రిడ్జి పనులు మరుగున పడిపోయాయి. మధ్యలో పలుమార్లు సర్వే చేసినా.. రైల్వే నుంచి అనుమతులు రాకపోవడంతో ప్రక్రియ ముందుకు సాగలేదు. కాగా ఇటీవల ప్రభుత్వ ఆదేశాల మేరకు బ్రిడ్జి నిర్మాణ డిజైన్‌తో పాటు రైల్వే శాఖ నుంచి క్లియరెన్స్ వచ్చినట్లు అధికారులు తెలిపారు.

రూ.100కోట్ల అంచనా..

జిల్లా కేంద్రం శివారు సిగ్నల్ కాలనీకి వెళ్లే మార్గంలో ఏ క్యాబిన్ సమీపంలో బ్రిడ్జి నిర్మాణం జరుగుతుందని అధికారులు చెబుతున్నారు. ఈ బ్రిడ్జికి రెండు వైపులా కలిపి కిలోమీటరు వరకు రోడ్ల నిర్మాణం చేపడుతారు. పాత బజార్‌వైపు ఈదులపూసపల్లి రోడ్డుకు.. కొత్త బజార్ వైపు తాళ్లపూసపల్లి రోడ్డు (మామిడి తోట సమీపంలో)కు కలుపుతూ ఆర్వోబీ పనులు చేపట్టనున్నారు. కాగా మరోసారి సర్వే చేసి నష్టపరిహారం, డిజైన్ ప్రతిపాదనలో మార్పులు చేర్పులు ఉంటాయని అధికారులు తెలిపారు. కాగా బ్రిడ్జి నిర్మాణానికి సుమారు రూ.80 నుంచి రూ.100కోట్లు అవసమని అంచనా వేసినట్లు తెలిపారు.

ఇలా వెళ్లే అవకాశం..

జిల్లా కేంద్రం శివారు ఈదులపూసపల్లి రోడ్డులోని నిజాం చెరువు కట్ట చివరి నుంచి బ్రిడ్జి రోడ్డు పనులు చేపట్టే విధంగా డిజైన్ చేసినట్లు సమాచారం. చెరువు కట్ట నుంచి గోపాలపురం మీదుగా నందన గార్డెన్ వెనుక గుట్టల నుంచి రోడ్డు పనులు చేపడుతారు. బ్రిడ్జి నిర్మాణంలో భాగంగా ఇళ్ల కూల్చివేతలు చేపట్టే అవకాశం ఉంది.

కల్యాణం.. కమనీయం



పట్టువస్త్రాలు తీసుకొస్తున్న ఆర్డీఓ, ఈఓ, చైర్మన్ దంపతులు



మంగళసూత్రాన్ని చూపిస్తున్న వేదపండితుడు

- వైభవోపేతంగా భద్రకాళీ సమేత వీరభద్రస్వామి కల్యాణం
- పట్టువస్త్రాలు సమర్పించిన ఆర్డీఓ, చైర్మన్, ఈఓ దంపతులు
- అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



ఆలయంలో కోడె మొక్కు చెల్లిస్తున్న భక్తుడు

కురవి: మహాశివరాత్రి సందర్భంగా భద్రకాళీ సమేత వీరభద్రస్వామి కల్యాణ మహోత్సవం శనివారం రాత్రి నుంచి ఆదివారం తెల్లవారుజాము వరకు కనుల పండువగా జరిగింది. అర్చకులు శివకిరణ్, శ్రీకర్, తేజ, బాలకృష్ణ, పుణ్యమూర్తి, శ్రీకాంత్, షణ్ముకశర్మ కల్యాణాన్ని నిర్వహించారు. ఎదుర్కోలు అనంతరం ఉత్సవమూర్తులను గ్రామ సేవ నుంచి వేదిక వద్దకు రాత్రి 11.05గంటలకు తీసుకొచ్చి అధిష్టించారు. ఆలయం నుంచి ఆర్డీఓ కొమురయ్య, ఈఓ సత్యనారాయణ, చైర్మన్ బాదావత్ రామునాయక్, సర్పంచ్ నూతక్కిపద్మనర్సింహారావు, మాజీ చైర్మన్ బాదావత్ రాజునాయక్‌లక్ష్మి 11.36గంటలకు పట్టువస్త్రాలు తీసుకొచ్చి సమర్పించారు. సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించగా ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్ కళాకారులను అభినందించారు.

కల్యాణం జరిగింది ఇలా..

వేదపండితులు స్వామివారి కల్యాణ తంతను 11.46 గంటలకు ప్రారంభించారు. అర్ధరాత్రి 12.15గంటలకు పీఠపూజ, 12.19 గంటలకు రక్షా బంధనం, యజ్ఞోపవితంగావించారు. 12.22గంటలకు స్వామి, అమ్మవార్లకు బాషికధారణ చేయడంతో పెళ్లికళ సంతరించుకుంది. గోత్రనామాలు పఠించారు. 12.31గంటలకు ఆలయ ఈఓ సత్యనారాయణ, సర్పంచ్ నూతక్కిపద్మ నర్సింహరావు పట్టు వస్త్రాలను సమర్పించారు. 12.45గంటలకు స్వామి, అమ్మవార్లకు జిలకరబెల్లం పెట్టారు. 12.51గంటలకు మంగళహారతి, 12.53గంటలకు మాంగళ్యపూజ చేసి మాంగళ్యధారణ జరిపించారు. 12.55గంటలకు తలంబ్రాలు చల్లారు. 1.03గంటలకు పూలదండలు వేయగా 1.05గంటలకు కల్యాణతంతును ముగించారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరై కల్యాణం తిలకించారు. ఎస్పీ శరత్‌చంద్రపవార్ ఆదేశాల మేరకు డీఎస్పీ రమణబాబు, సీఐ రవికుమార్ కల్యాణం వద్ద బారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

మొక్కుల చెల్లింపు..

స్వామివారి కల్యాణం అనంతరం ఆదివారం తెల్లవారుజాము నుంచే భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. భద్రకాళీ అమ్మవారికి బోనాలు సమర్పించుకున్నారు. వీరభద్రుడికి తలనీలాలు సమర్పించుకున్నారు. ఆలయంలో పానసారం పట్టి స్వామిని కోర్కెలు కోరారు. వీరభద్రుడికి కోడెను కట్టి తమ మొక్కులు చెల్లించుకున్నారు.

రైల్వేస్టేషన్‌లో వెలగని లైట్లు

గార్ల: స్థానిక రైల్వేస్టేషన్‌లో ఆదివారం లైట్లు వెలగకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందిపడ్డారు. రైలు దిగిన ప్రయాణికులు సెల్‌ఫోన్ లైట్ వెలుగులో బయటకు వెళ్లారు. కాగా గార్ల రైల్వేస్టేషన్‌కు ఏడాదికి సుమారు రూ.1.50కోట్ల ఆదాయం వస్తున్నా.. సంబంధిత అధికారులు మాత్రం కనీస సౌకర్యాలు కల్పించడంలో విఫలమయ్యారని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా రైల్వే అధికారులు రైల్వేస్టేషన్‌లో లైటింగ్ సౌకర్యం కల్పించాలని ప్రయాణికులు కోరుతున్నారు.



చీకట్లో నిలబడిన ప్రయాణికులు

సేవాలాల్ స్ఫూర్తితో గిరిజనుల అభివృద్ధి

- రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు



తొర్రూరులో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి దయాకర్‌రావు

తొర్రూరు: బంజారాల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ స్ఫూర్తితో తెలంగాణ ప్రభుత్వం గిరిజనుల అభివృద్ధి, సంక్షేమానికి కృషి చేస్తూ దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. ఆదివారం డివిజన్ కేంద్రంలో గిరిజన సమన్వయ కమిటీ అధ్యక్షుడు ధరావత్ జైసింగ్ ఆధ్వర్యంలో గిరిజన కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ నెల 26న పాలకుర్తి మండల కేంద్రంలో చేపట్టనున్న సేవాలాల్, మేరామా యాడి దేవాలయ నిర్మాణ భూమి పూజ కార్యక్రమంపై మంత్రి ఆలయ కమిటీ, గిరిజన నాయకులతో మాట్లాడారు. రూ.2కోట్ల నిధులతో ఎకరం స్థలంలో సేవాలాల్ మహరాజ్ ఆలయం, భవన నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. సీఎం కేసీఆర్ బంజారాల అభివృద్ధి కోసం 3,146 తండాలను పంచాయతీలుగా గుర్తించి గిరిజనుల ఆత్మగౌరవాన్ని నిలిపారన్నారు. ఛత్రపతి శివాజీ జయంతి వేడుకల్లో భాగంగా నిర్వహించిన ర్యాలీలో మంత్రి పాల్గొన్నారు. మున్సిపల్ చైర్మన్ రామచంద్రయ్య, ఎంపీపీ చిన్న అంజయ్య, జెడ్పీటీసీ శ్రీనివాస్, సేవాలాల్ ఆలయ కమిటీ అధ్యక్షుడు రవిరాథోడ్, జీసీసీ మాజీ చైర్మన్ గాంధీనాయక్, నాయకులు ధరావత్ కిషన్‌నాయక్, రాంసింగ్ నాయక్, రవీందర్‌నాయక్, పూల్‌సింగ్, కాలునాయక్, సురేష్, స్వామి, గణేష్ పాల్గొన్నారు.

అనుచిత వ్యాఖ్యలు మానుకోవాలి

- మంత్రి సత్యవతి రాథోడ్
- బొడ్రాయికి తిరుగు బోనం సమర్పణ



బోనం సమర్పిస్తున్న మంత్రి సత్యవతిరాథోడ్

మహబూబాబాద్ రూరల్: ప్రజాప్రస్థానం పాదయాత్రలో వైఎస్ షర్మిల నిరాధార ఆరోపణలు, వ్యక్తిగత విమర్శలు, అనుచిత వ్యాఖ్యలు మానుకోవాలంటూ మంత్రి సత్యవతి రాథోడ్ హితవుపలికారు. మానుకోట పట్టణ బొడ్రాయి పునఃప్రతిష్ఠాపన అనంతరం ఆదివారం బోనం సమర్పించి మంత్రి ప్రత్యేక పూజలు చేశారు. జిల్లా ప్రజలు సుఖసంతోషాలతో జీవించేలా అమ్మవారి కటాక్షం ఉండాలని కోరారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకుని ప్రజలు సుభిక్షంగా ఉండాలని మంత్రి ఆకాంక్షించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. ఎమ్మెల్యే బానోత్ శంకర్ నాయక్, ఎంపీ మాలోత్ కవితపై వైఎస్సార్ టీపీ అధ్యక్షురాలు షర్మిల చేసిన వ్యాఖ్యలు సరికాదన్నారు. ఇలాంటివి సహించేది లేదని హెచ్చరించారు. సీఎం కేసీఆర్ పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తుందని, ఇక్కడ ఇతర నాయకుల పాలన అవసరం లేదని పేర్కొన్నారు. రాజన్న రాజ్యానికి వ్యతిరేకంగా తెలంగాణ ఉద్యమం జరిగిందని మంత్రి గుర్తు చేశారు. మళ్లీ ఏ ముఖం పెట్టుకొని ఇక్కడికి వచ్చి విమర్శలు చేస్తారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఎం కేసీఆర్, తెలంగాణ ఉద్యమకారులపై వ్యక్తిగత దూషణలు చేస్తే సహించేది లేదని మంత్రి స్పష్టం చేశారు. ఇప్పటికైనా పరిమితుల మేరకు పాదయాత్ర చేసుకోవాలని, అతిక్రమించి రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తే ప్రజల నుంచి ప్రతిఘటన తప్పదని హెచ్చరించారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ రామ్మోహన్ రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు పర్కాల శ్రీనివాసరెడ్డి, గుగులోత్ శ్రీరాంనాయక్, కర్పూరపు గోపి, ఎడ్ల రమేష్, స్థానిక మున్సిపల్ వార్డు కౌన్సిలర్ ఎడ్ల వేణు, నిమ్మల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

గిరిజనులను మోసం చేస్తున్న సీఎం



సమావేశంలో మాట్లాడుతున్న హుస్సేన్‌నాయక్

మహబూబాబాద్ అర్బన్: సీఎం కేసీఆర్ గిరిజనబంధు ఇవ్వకుండా గిరిజనులను మోసం చేస్తున్నారని గిరిజన మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు జాటోత్ హుస్సేన్ నాయక్ అన్నారు. జిల్లా కేంద్రంలోని సిగ్నల్‌కాలనీలో ఆదివారం ప్రజాగోస–బీజేపీ భరోసా కార్నర్ సమావేశం నిర్వహించగా ముఖ్య అతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో ఆదివాసీలు, గిరిజనులకు పోడు భూముల హక్కు పత్రాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. డబుల్‌బెడ్రూం ఇళ్లు ఇప్పటివరకు ఏ ఒక్కరికి అందించలేదని ఆరోపించారు. అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్న బీఆర్‌ఎస్ నాయకులకు ప్రజలు తగిన బుద్ధి చెప్పాలన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను రాష్ట్ర ప్రభుత్వానివిగా చెప్పుకుంటూ పబ్బం గడుపుకుంటున్నారని మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను బీజేపీ కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. రాష్ట్రంలో సీఎం కేసీఆర్‌ను గద్దె దించాలని, రానున్న రోజుల్లో మానుకోట గడ్డపై బీజేపీ జెండా ఎగురవేయాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు ఆకుల శ్రీనివాస్, పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ సింగారం సతీష్, శక్తి కేంద్ర ఇన్‌చార్జ్ చింతల శివ, గిరిజన మోర్చా జిల్లా అధ్యక్షుడు రాంబాబునాయక్, నాయకులు మాలోత్ బాలునాయక్, శ్యామ్‌కుమార్, లక్ష్మీనారాయణ, పల్లె సందీప్, వెన్నమల్ల సందీప్, జిల్లా మహిళా అధ్యక్షురాలు ఇందుభారతి తదితరులు పాల్గొన్నారు.

మానుకోటలో హైటెన్షన్

- ఎమ్మెల్యేపై అనుచిత వ్యాఖ్యలు చేసిన షర్మిలపై బీఆర్‌ఎస్ కార్యకర్తల ఆగ్రహం
- జాతీయ రహదారిపై రాస్తారోకో
- షర్మిల గోబ్యాక్ అంటూ నినాదాలు, క్షమాపణలు చెప్పాలని డిమాండ్
- ఆమె బస చేసిన బేతోలు ప్రాంతంలో ఉద్రిక్త వాతావరణం
- అరెస్ట్ చేసి హైదరాబాద్‌కు తరలింపు



వైఎస్ షర్మిల బస చేసిన వాహనం వద్ద పోలీసులు



బీఆర్‌ఎస్ శ్రేణులు రాకుండా అడ్డుకుంటున్న పోలీసులు



ఫ్లెక్సీలను దహనం చేస్తున్న కార్యకర్తలు

మహబూబాబాద్ రూరల్: మానుకోటలో హైటెన్షన్ నెలకొంది. ఎమ్మెల్యే శంకర్‌నాయక్‌పై వైఎస్సార్ టీపీ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిల చేసిన వ్యాఖ్యలు రాజకీయ దుమారం రేపాయి. ఎమ్మెల్యేపై తీవ్ర వ్యాఖ్యలు చేసిన నేపథ్యంలో బీఆర్‌ఎస్ పార్టీ ఇచ్చిన పిలుపు మేరకు ఆదివారం ఉదయం షర్మిల బస చేసిన బేతోలు ప్రాంతానికి వందలాది మంది కార్యకర్తలు చేరుకున్నారు. ఒకవైపు జాతీయ రహదారిపై రాస్తారోకో.. మరోవైపు షర్మిల గోబ్యాక్, క్షమాపణలు చెప్పాలనే నినాదాలతో ఆప్రాంతమంతా ఉద్రిక్తత నెలకొంది. ప్రజాప్రస్థానం పాదయాత్రలో భాగంగా శనివారం జిల్లా కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయ సెంటర్‌లో నిర్వహించిన బహిరంగ సభలో వైఎస్ షర్మిల స్థానిక ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారన్న ఫిర్యాదు మేరకు పోలీసులు ఎస్సీ, ఎస్టీ, అట్రాసిటీ కేసు నమోదు చేశారు. ఈ క్రమంలో ఆదివారం తెల్లవారుజామునుంచే మానుకోట మున్సిపాలిటీ పరిధి బేతోలు గ్రామ శివారులో షర్మిల బస చేసిన ప్రాంతానికి వందల సంఖ్యలో బీఆర్‌ఎస్ కార్యకర్తలు చేరుకున్నారు. షర్మిల గోబ్యాక్ అంటూ.. ఆమె క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. భజనతండా వద్ద జాతీయ రహదారిపై ఎమ్మెల్యే శంకర్‌నాయక్ సతీమణి డాక్టర్ సీతామహాలక్ష్మి ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ శ్రేణులు ఆందోళన చేసి రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సతీమణి మాట్లాడారు. తన భర్త ఎమ్మెల్యే శంకర్‌నాయక్‌పై వ్యక్తిగత దూషణలు చేయడం వైఎస్ షర్మిలకు తగదన్నారు. ఎమ్మెల్యేపై అనవసరపు ఆరోపణలు చేస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. ఎలాంటి ఆధారాలు లేకుండా మాట్లాడడం సరికాదన్నారు. కాగా కిలోమీటరు పొడవునా వాహనాలు నిలిచిపోయి ట్రాఫిక్‌జాం ఏర్పడింది. షర్మిల ఫ్లెక్సీలను దహనం చేశారు.

షర్మిల అరెస్టు..

బీఆర్‌ఎస్ శ్రేణులు షర్మిల బస చేసిన ప్రాంతంలోని గుడారాలు, ఆమె ఉన్న వాహనంపై దాడి చేస్తారేమోనని పసిగట్టి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భారీగా పోలీసులు మోహరించారు. ఒకానొక సందర్భంలో బీఆర్‌ఎస్ శ్రేణులు ఆగ్రహంతో దూసుకువచ్చి షర్మిల బస చేసిన ప్రాంగణంలోకి చేరుకునే ప్రయత్నం చేశారు. పోలీసులు వారిని వారించి అక్కడనుంచి పక్కకు పంపించారు. ఆందోళనకారుల వల్ల పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారడంతో గమనించిన పోలీసులు ఎస్పీకి సమాచారం ఇవ్వగా.. షర్మిల పాదయాత్రను వెంటనే రద్దు చేస్తున్నామని ఎస్పీ శరత్‌చంద్ర పవార్ ఉత్తర్వులు పంపించారు. చివరికి వైఎస్ షర్మిలను అరెస్టు చేసి పోలీసు బందోబస్తు నడుమ హైదరాబాద్‌కు తరలించారు. ఆమె వెళ్తున్న పోలీసు వాహనంపై ఆందోళనకారులు రాళ్లు వేసేందుకు యత్నించారు. వారిని పోలీసులు అడ్డుకున్నారు. ఓ ఆందోళనకారుడు రాయి విసరగా అడ్డుకునే సందర్భంలో హెడ్ కానిస్టేబుల్ ఎం.నాగేశ్వర్‌రావు ఎడమచేతికి స్వల్ప గాయమైంది. అడిషనల్ ఎస్పీ జోగుల చెన్నయ్య ఆధ్వర్యంలో డీఎస్పీలు రమణబాబు, రఘు, సీఐలు సతీష్, రవికుమార్, వెంకటరత్నం, యాసిన్, సత్యనారాయణ, ఎస్సైలు, సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.

మేడారంలో భక్తుల సందడి



సమ్మక్క గద్దె వద్ద పూజలు చేస్తున్న భక్తులు


ఎస్‌ఎస్ తాడ్వాయి: మేడారంలోని సమ్మక్క–సారలమ్మను దర్శించుకునేందుకు ఆదివారం భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. సుదూర ప్రాంతాల నుంచి మేడారానికి తరలివచ్చిన భక్తులు వనదేవతల గద్దెల వద్ద పసుపు, కుంకుమ, చీర సారె, ఒడి బియ్యం, కానుకలు, ఎత్తు బంగారం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. గోవిందరాజు, పగిడిద్దరాజులకు పూజలు చేశారు. శివరాత్రి పండుగ సందర్భంగా రామప్ప, కాళేశ్వరానికి వచ్చిన భక్తులు మేడారానికి తరలివచ్చి అమ్మవార్లను దర్శించుకున్నారు.



ఎత్తు బంగారంతో భక్తులు

పొంచి ఉన్న ప్రమాదం

- మానుకోటలో ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద కానరాని రక్షణ చర్యలు
- కంచెలు లేకపోవడంతో ప్రజల భయాందోళన
- ఏర్పాటు చేయాలని వేడుకోలు



తాళ్లపూసపల్లి రోడ్డులో ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్

నెహ్రూసెంటర్: విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు.. ప్రమాదాలకు నిలయాలుగా మారుతున్నాయి. ట్రాన్స్‌ఫార్మర్లు, ఫ్యూజ్ బాక్సుల వద్ద ఎలాంటి రక్షణ చర్యలు చేపట్టకపోవడంతో ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయి. కంచెలు లేని ట్రాన్స్‌ఫార్మర్ల వల్ల జిల్లాలో చాలావరకు పశువులు విద్యుత్ ప్రమాదాలకు గురై మృతువాతపడిన సంఘటనలు ఉన్నాయి. అలాగే మనుషులకు ప్రమాదం పొంచి ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా కేంద్రంలోని క్యాబిన్ ఏరియాలోని పాఠశాల ప్రాంతంలో చేతికందే ఎత్తులోనే ట్రాన్స్‌ఫార్మర్ ఉంది. అలాగే తాళ్లపూసపల్లి రోడ్డులో రోడ్డును ఆనుకుని ఎలాంటి రక్షణ చర్యలు లేకుండా ట్రాన్స్‌ఫార్మర్ ఉంది. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ కంచెలు ఏర్పాటు చేసి ప్రమాదాలు జరుగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

రక్షణ చర్యలు తీసుకోవాలి

జిల్లా కేంద్రంలో రక్షణ చర్యలు లేకుండా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద అధికారులు కంచెలు ఏర్పాటు చేసి రక్షణ చర్యలు చేట్టాలి. ప్రజలు, పశువులు విద్యుత్ ప్రమాదాల బారిన పడకుండా చూడాలి. ప్రాణనష్టం జరగకముందే జాగ్రత్తలు తీసుకోవాలి.

-గాదెం శ్యాంప్రసాద్, స్థానికుడు

చర్యలు తీసుకుంటాం

జిల్లా కేంద్రంలోని ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద కంచెలు ఏర్పాటు చేసి రక్షణ చర్యలు తీసుకుంటాం. వినియోగదారులు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా జాగ్రత్త చర్యలు తీసుకుంటాం.

- పి.విజయ్, డీఈ, మహబూబాబాద్

వ్యక్తి ఆత్మహత్య


ప్రభాకరా చారీ

ఎల్కతుర్తి: అనారోగ్య సమస్యతో బాధపడుతూ జీవితంపై విరక్తి చెందిన ఓ వ్యక్తి పురుగులమందు తాగి ఆదివారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై జక్కుల పరమేష్ తెలిపిన వివరాల ప్రకారం.. హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండల కేంద్రానికి చెందిన కందుకూరి ప్రభాకరా చారీ (65) స్థానికంగా వెల్డింగ్ వర్క్ చేసుకుంటూ జీవిస్తుండేవాడు. ఆయన భార్య రెండేళ్ల క్రితం అనారోగ్యంతో మృతి చెందింది. వీరికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. వారికి వివాహాలు జరిగాయి. ప్రభాకర్ ఒంటరి జీవితం గడపలేక, అనారోగ్య సమస్యలతో బాధపడుతూ ఆత్మహత్య చేసుకున్నట్లు చెప్పారు. మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం హుజూరాబాద్ మార్చురీకి తరలించినట్లు తెలిపారు.

అనారోగ్య కారణాలతో..


కుమారస్వామి (ఫైల్)

కమలాపూర్: హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలంలోని గూడూరుకు చెందిన బండి కుమారస్వామి (48) అనారోగ్య కారణాలతో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీస్ ఇన్‌స్పెక్టర్ బొలిమల్ల సంజీవ్ తెలిపారు. వ్యవసాయం చేసుకుని జీవనం సాగించే కుమారస్వామికి వివాహం కాలేదని, గత ఐదేళ్లుగా బీపీ, షుగర్, అల్సర్, కడుపు నొప్పితో బాధపడుతున్నాడని, అప్పుడప్పుడు కడుపులో విపరీతమైన మంట, నొప్పి వస్తున్నాయని బంధువులకు చెప్పుకుని ఏడ్చేవాడని తెలిపారు. ఆదివారం ఉదయం 10 గంటల సమయంలో కుమారస్వామిని పలుకరిద్దామని ఆయన సోదరుడి కుమారుడు వినయ్‌సాగర్ వెళ్లగా ఇంటి తలుపులు మూసి ఉన్నాయని, ఎంత పిలిచినా తలుపులు తెరువకపోయే సరికి కిటికీలోంచి చూడగా సీలింగ్ ఫ్యాన్ బిగించే ఇనుప రింగ్‌కు తాడుతో ఉరి వేసుకుని వేలాడుతూ కనిపించాడని తెలిపారు. కుమారస్వామి బీపీ, షుగర్, అల్సర్, కడుపు నొప్పితో బాధపడుతూ తీవ్ర మనస్థాపానికి గురై ఆత్మహత్యకు పాలప్డి మృతి చెందాడని వినయ్‌సాగర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

లారీ డ్రైవర్..

హసన్‌పర్తి: అప్పుల బాధతో లారీ డ్రైవర్ ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈసంఘటన హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండలం నాగారంలో ఆదివారం చోటు చేసుకుంది. కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. నాగారానికి చెందిన జి.శ్రీనివాస్(42) లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. శ్రీనివాస్‌కు భార్య, కూతురు, కుమారుడు ఉన్నారు. అయితే కుటుంబపోషణ నిమిత్తం వివిధ వర్గాల నుంచి తీసుకున్న అప్పులు చెల్లించలేనని కొంత కాలంగా మద్యానికి బానిసయ్యాడు. ఈక్రమంలో ఆదివారం గ్రామ శివారులోని ఓ చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం వరంగల్‌లోని ఎంజీఎం మార్చురీకి తరలించారు. బాధిత కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై విజయ్‌కుమార్ తెలిపారు.

మానవ ప్రమేయం లేకుండా ప్యాకింగ్


మ్యాప్స్ 6ఎస్2 మిషన్

మానవ ప్రమేయం లేకుండా అన్ని రకాల ప్యాకింగ్‌లను చేపట్టేందుకు మ్యాప్స్ 6ఎస్2 యంత్రం తోడ్పడుతుంది. మందులు, జంక్ ఫుడ్స్, వివిధ రకాల ఎలక్ట్రికల్ వస్తువులను ప్యాకింగ్ చేసేందుకు తోడ్పడుతుంది. స్వయంగా నాణ్యమైన వస్తువులను సేకరించడం, సరైన పద్ధతిలో ప్యాకింగ్ చేయడం మిషన్ ప్రత్యేకత. కంపెనీల్లో ఇలాంటి మిషన్స్‌పై పని చేసేందుకు విద్యార్థులకు శిక్షణ అందజేస్తున్నారు.

స్పాట్ వెల్డింగ్


కుకా రోబో

కార్ల కంపెనీల్లో స్పాట్ వెల్డింగ్ అనేది అత్యాధునిక టెక్నాలజీ. దీని కోసం నిట్‌లోని సీమెన్స్ సంస్థ కుకా రోబోను అందుబాటులోకి తీసుకొచ్చింది. స్పాట్ వెల్డింగ్, కార్ల తయారీలో వివిధ రకాల పరికరాలను అమర్చేందుకు, వెల్డింగ్‌కు ఇది తోడ్పడుతుంది.

ఏసీ తీసుకుని.. డీసీగా మార్చి..


అడ్వాన్స్‌డ్ యూపీఎస్

అడ్వాన్స్‌డ్ యూపీఎస్.. ఇది 60 కేవీ విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తుంది. ఏసీ కరెంట్‌ను తీసుకుని డీసీ కరెంట్‌గా మార్చుకుని తిరిగి ఇన్వర్టర్లకు ఏసీ కరెంట్‌ను అందజేస్తుంది. ఇలాంటి అడ్వాన్స్‌డ్ యూపీఎస్‌లను సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీలో రెండు ఏర్పాటు చేశారు. స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణలో, ఆవిష్కరణలు చేపట్టే తరుణంలో విద్యుత్ అంతరాయం లేకుండా తోడ్పడుతున్నాయి.

ఆలోచనల ఆవిష్కరణ

- నిట్‌లో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ
- స్కిల్ డెవలప్‌మెంట్‌కు కేరాఫ్‌గా సీమెన్స్
- ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు, స్టార్టప్స్‌కు అవకాశం
- మూడేళ్లలో 30వేల మందికి శిక్షణే లక్ష్యం


సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ భవనంలో నిట్ సీమెన్స్ సంస్థ

లక్ష్యం.. 30వేల మందికి శిక్షణ

రాబోవు మూడేండ్లలో 30వేల మంది ఇంజనీరింగ్ విద్యార్థులకు స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణ అందించడమే లక్ష్యంగా నిట్–సీమెన్స్ సంస్థ ఒప్పందం కుదుర్చుకుంది. మార్చి నుంచి విద్యార్థులకు శిక్షణ ప్రారంభించనున్నారు. గత ఏడాది కిట్స్ కళాశాలలో 60 మంది ఇంజనీరింగ్ విద్యార్థులకు స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణ ఇచ్చారు.

కాజీపేట అర్బన్: ఆలోచనలకు ఆవిష్కరణల రూపకల్పన చేపట్టేందుకు వేదికగా నిట్ వరంగల్‌లోని సెంటర్ ఫర్ ఎక్సలెన్సీ భవనంలో సీమెన్స్ సంస్థ ఏర్పాటు చేయబడింది. ఇంజనీరింగ్ విద్యార్థులకు స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణ, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు, స్టార్టప్స్‌కు తమ ఆలోచనలకు అనుగుణంగా మిషనరీస్‌ను అందజేసేందుకు నిట్ వరంగల్, సీమెన్స్ సంస్థ 2020లో ఒప్పందం కుదుర్చుకున్నాయి. నిట్ వరంగల్ రూ.20 కోట్లు, సీమెన్స్ సంస్థ రూ.151 కోట్ల నిధులతో అత్యాధునిక యంత్రాలను సెంటర్ ఫర్ ఎక్సలెన్సీలో అందుబాటులోకి తీసుకొచ్చారు. ఇంక్యూబేషిన్ సెంటర్‌లా నూతన ఆవిష్కరణలకు, స్కిల్ డెవలప్‌మెంట్‌కు తోడ్పడుతున్న నిట్– సీమెన్స్ సంస్థపై 'సాక్షి' ప్రత్యేక కథనం.

స్కిల్ డెవలప్‌మెంట్‌కు కేరాఫ్‌గా..

భారత ప్రభుత్వం ఆత్మ నిర్భర్‌భారత్, మేక్ ఇన్ ఇండియాకు నిదర్శనంగా సీమెన్స్ సంస్థ నిట్ నిలవనున్నాయి. ఇంజనీరింగ్ విద్యార్థులకు అన్ని రంగాల్లో స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణను అందజేస్తూనే ఆధునిక యంత్రాలపై అవగాహన కల్పించనున్నారు. సీమెన్స్ స్కిల్ డెవలప్‌మెంట్ తన ప్రత్యేక ప్రోగ్రాం ల్యాంగ్వేజీ మైండ్ స్పీయర్ ల్యాంగ్వేజీతో క్యాంపస్ సెలక్షన్స్‌కు తోడ్పడనుంది. దీంతో నూతన పరిశోధనలతో ఆవిష్కరణలు చేపట్టే అవకాశం ఉంటుంది.

నిట్ వరంగల్‌లో సీమెన్స్..

నిట్‌లోని సెంటర్ ఫర్ ఎక్సలెన్సీ భవనంలో ఏర్పాటు చేసిన నిట్, సీమెన్స్ సంస్థ మానవ ప్రమేయం లేకుండా అత్యాధునిక యంత్రాలతో, నాణ్యమైన పనులను చేపట్టేందుకు పని చేస్తుంది. ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, మెడికల్, మెట్రో ట్రేయిన్ మోటార్స్, టెలీ కమ్యూనికేషన్స్ తదితర రంగాల్లో సీమెన్స్ ఉత్పత్తి చేస్తుంది. జర్మనీలో 1963లో ప్రారంభమైన సీమెన్స్ కంపెనీ భారతదేశానికి 1910లో రాగా నిట్ వరంగల్‌లో 2020లో అడుగుపెట్టింది.

నిట్‌కు ఆర్థిక వనరుగా సీమెన్స్

సాఫ్ట్‌వేర్ ఇంజనీర్స్‌కు ఇంక్యూబేషన్ సెంటర్ లా ఇంజనీరింగ్ విద్యార్థులకు స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణ అందించేందుకు సీమెన్స్ తోడ్పడుతుంది. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు, స్టార్టప్స్‌కు సెంటర్‌ఫర్ ఎక్సలెన్సీ భవనంలో ఏర్పాటు చేసిన నిట్, సీమెన్స్ సంస్థలోని అత్యాధునిక పరికరాలను, శిక్షణకు, ఆవిష్కరణలకు సౌకర్యాన్ని కల్పించనున్నారు. దీంతో ఇప్పటికే నిట్ వరంగల్‌లోని సీఆర్ఐఎఫ్ ఆర్థిక వనరుగా తోడ్పడుతుండగా అదే కోవలోకి సీమెన్స్ రానుంది.

అందుబాటులో 13 ల్యాబ్స్

- ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్(ఐఓటీ)
- అడిటివ్ మ్యాన్యూఫ్యాక్చరింగ్
- అడ్వాన్స్ మ్యాన్యూఫ్యాక్చరింగ్
- ఆటోమేషన్
- సీఎన్‌సీ కంట్రోలర్
- సీఎన్‌సీ మషీన్స్
- ఎలక్ట్రికల్ ఎనర్జీ అండ్ సేవింగ్స్
- మెకానికల్
- ప్రాసెస్ ఇన్స్ట్రుమెంటేషన్
- ప్రాడక్ట్స్ డిజైన్ అండ్ వాలిడేషన్
- రోబోటిక్స్
- స్మార్ట్ ఫ్యాక్టరీ
- టెస్ట్ అండ్ ఆప్టిమైజేషన్

ఇంజనీరింగ్ విద్యార్థులకు స్కిల్ డెవలప్‌మెంట్



ఇంజనీరింగ్ విద్యార్థులకు స్కిల్ డెవలప్‌మెంట్‌లో శిక్షణ ఇచ్చేందుకు సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీలో నిట్, సీమెన్స్ సంస్థ ఏర్పాటు చేయబడింది. ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు, స్టార్టప్స్ తమ ఆలోచనలకు అనుగుణంగా ఆవిష్కరణలు చేపట్టేందుకు అన్ని రకాల వసతులు, మిషన్స్‌ను అందుబాటులోకి తీసుకొస్తున్నాం.

– క్రిష్ణానంద్, చీఫ్ ఎగ్జిక్యూటివ్, సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ, నిట్ ప్రొఫెసర్

కొనసాగుతున్న దేహదారుఢ్య పరీక్షలు


పరుగు పోటీలో పాల్గొన్న అభ్యర్థులు

వరంగల్ క్రైం : కాకతీయ యూనివర్సిటీలోని మైదానంలో పోలీస్ కానిస్టేబుల్, సబ్ ఇన్‌స్పెక్టర్ల నియామకాలకు దేహదారుఢ్య పరీక్షలు కొనసాగుతున్నాయి. ఆదివారం 1,184 మంది అభ్యర్థులకు ఈవెంట్ల హాల్ టికెట్లు జారీ చేయగా, 925 మంది అభ్యర్థులు హాజరయ్యారు. వీరిలో తుది పరీక్షలకు 435 మంది ఎంపికైనట్లు వరంగల్ పోలీస్ కమిషనర్ రంగనాథ్ వెల్లడించారు. కార్యక్రమంలో క్రైం డీసీపీ మురళీధర్, అదనపు డీసీపీలు సంజీవ్, సురేష్‌కుమార్‌లతో పాటు ఏసీపీలు, ఆర్‌ఐలు, ఇన్‌స్పెక్టర్లు, తదితరులు పాల్గొన్నారు.

నకిలీ నోట్ల కలకలం!


రూ.100నకిలీ నోటు

కాళేశ్వరం: భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం కాళేశ్వరంలో నకిలీ నోట్లు కలకలం రేపుతున్నాయి. కాళేశ్వరం పుణ్యక్షేత్రంలో గోదావరి తీరం, గ్రామంలో కిరాణ, బెల్టు, మద్యం దుకాణాలు, చికెన్ సెంటర్లను నకిలీ నోట్లు సరఫరా చేసే వ్యక్తులు ఎంచుకుంటున్నట్లు సమాచారం. ఆదివారం గోదావరి తీరం వద్ద ఒకరికి రూ.100 నకిలీ నోటు భక్తుడు ఇవ్వడంతో అది నకిలీ అని తేల్చడంతో మరోటి ఇచ్చినట్లు తెలిసింది. ఇలా రూ.200, రూ.100 నకిలీ నోట్లు గత కొన్ని రోజులుగా చలామణి అవుతున్నట్లు తెలిసింది. అయితే నకిలీ నోట్ల చలామణిపై ఎవరూ స్పందించకపోవడతో వారు మరింత రెచ్చిపోయే ప్రమాదం ఉందని పలువురు అభిప్రాయపతున్నారు.

సంత్ సేవాలాల్ అవతార పురుషుడు

- బంజారాల ఆత్మీయ సమ్మేళనంలో మంత్రి దయాకర్‌రావు


మాట్లాడుతున్న మంత్రి దయాకర్‌రావు, వేదికపై వినయ్‌భాస్కర్, బంజారా సంఘాల ప్రతినిధులు

హన్మకొండ అర్బన్: అయోధ్యను ఏలిన శ్రీరాముడి మాదిరిగా మానవ రూపంలో పుట్టిన అవతార పురుషుడు సంత్‌సేవాలాల్ మహరాజ్ అని రాష్ట్ర మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. ఆదివారం హన్మకొండ నిట్ సమీపంలోని ఓ ఫంక్షన్ హాలులో ఉమ్మడి జిల్లా బంజారా ఆత్మీయ సమ్మేళనం, క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న మంత్రి దయాకర్‌రావు మాట్లాడారు. బంజారాలు కల్మశం లేని మనుషులని, వారు నమ్మితే ప్రాణాలు ఇస్తారని అన్నారు. తన 40ళ్ల రాజకీయ ప్రస్తానంలో బంజారాలది కీలపాత్ర అన్నారు. పాలకుర్తిలో బంజారాలు సేవాలాల్ విగ్రహం ఏర్పాటు చేస్తామంటే ఎకరం స్థలం, రెండు కోట్ల రూపాయలు కేటాయించామని దానికి ఈ నెల 26న ప్రారంభిస్తున్నమని మంత్రి తెలిపారు. హైదరాబాద్‌లో రూ.100కోట్లతో సేవాలాల్ భవన్ నిర్మించామన్నారు. వినయ్‌భాస్కర్ మాట్లాడుతూ.. నియోజక వర్గంలో బంజారాలకు సంబంధించి సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని వాటి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. బంజారాలతో తనకు విడదీయరాని బంధం ఉందన్నారు. కార్యక్రమంలో బంజారాల డైరీ, క్యాలెండర్లు ఆవిష్కరించారు. వివిధ బంజారా సంఘాల ప్రతినిధులు మాజీ ఎంపీ సీతారాంనాయక్, పాడియ గాంగూనాయక్, పోరిక జవహర్‌లాల్, అజ్మీరా బోజానాయక్, చందూలాల్, పోరిక వీరన్న, గుగులోత్ వీరమ్మ, సత్యవతినాయక్, బానోత్ వెంకట్‌నాయక్ తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో భాగంగా బంజారా మహిళల సాంప్రదాయ నృత్యాలు కట్టుకున్నాయి.

ఆదివాసీలతో సమానంగా హక్కులు కల్పించాలి

- బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య


మాట్లాడుతున్న ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య

ఏటూరునాగారం: జిల్లాలోని నేతకానీ కులస్తులకు ఆదివాసీలతో సమానంగా ఏజెన్సీ హక్కు కల్పించాలని బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య అన్నారు. ములుగు జిల్లా ఏటూరునాగారం మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో నేతకానీ సంఘం రాష్ట్ర నాయకుడు దుర్గం రమణయ్య ఆధ్వర్యంలో ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలోని నేతకానీ కులస్తులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఏజెన్సీలోని నేతకానీలకు ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వాలని, ఆదివాసీలకు కల్పించిన హక్కులు, చట్టాలు నేతకానీలకు కల్పించాలన్నారు. తెలంగాణ రాష్ట్ర వచ్చిన తర్వాతనే నేతకానీ కులస్తులను కేసీఆర్ ప్రభుత్వం గుర్తించిందన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించుకునేందుకు ఒక్కతాటిపైకి రావాలన్నారు. మనకు ఉన్న హక్కులను కాపాడుకోవాలన్నారు. ఎస్సీల్లో 59 కులాలున్నాయని, వాటిలో నేతకాని కులస్తులు ఉన్న సంగతి ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు మర్చిపోవద్దు అన్నారు. మొట్టమొదటిగా నేతకానికులం నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికై అసెంబ్లీలో అడుగుపెట్టానని, ప్రజలకు ఏ సమస్య వచ్చినా అండగా ఉంటానన్నారు. అనేక మంది పేదవారికి సరైన వసతి, ఇళ్లు, మెరుగైన వైద్యం, చదువు అందడం లేదన్నారు. ఐక్యంగా ఉద్యమించి సత్తా చాటుదామని పిలుపునిచ్చారు. ఈ ప్రభుత్వంలోనే నేతకానీలకు సరైన న్యాయం జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు దుర్గం రాజేష్, జిల్లా అధ్యక్షుడు జాడి రాంబాబు, మాజీ వర్కింగ్ ప్రెసిడెంట్ కావిరి చిన్నికృష్ణ, చిన్న రాజయ్య, దీకొండ నర్సింగరావు, కాంతారావు, లక్ష్మీకాంత్, చంద్రబాబు, జాడి వెంకటేష్, మల్లేష్, చింతగూడెం సర్పంచ్ నారాయణ, దుర్గం రాజేష్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకుల మృతి

- గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ఘటన
- పాలకుర్తి మహాశివరాత్రి జాతరకు వెళ్లొస్తుండగా ప్రమాదం


వెంకన్న(ఫైల్)


అనిల్(ఫైల్)


రోదిస్తున్న అనిల్ కుటుంబ సభ్యులు

పాలకుర్తి టౌన్: జనగామ జిల్లా పాలకుర్తి మండల కేంద్రంలోని నయార పెట్రోల్ బంకు వద్ద గుర్తు తెలియని వాహనం మోటార్ సైకిల్‌ను ఢీకొట్టడంతో ఇద్దరు యువకులు మృతి చెందారు. ఆదివారం తెల్లవారు జామున జరిగిన ఘటనకు సంబంధించి, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం దౌలత్‌నగర్ శివారు చెరువుకొమ్ముతండా గ్రామానికి చెందిన దారావత్ భద్రు కుమారుడు దారవత్ వెంకన్న(18), దారావత్ వీరన్న కుమారుడు అనిల్(18), దారావత్ రఘుపతి, మూనావత్ ప్రవీన్‌లు కలిసి రెండు మోటార్ సైకిళ్లపై శనివారం సాయంత్రం పాలకుర్తి మహాశిరాత్రి జాతర సందర్భగా శ్రీసోమేశ్వర లక్ష్మీనర్సింహస్వామిని దర్శించుకొని తిరిగి ఆదివారం తెల్లవారు జామున స్వగ్రామానికి మోటార్ సైకిళ్లపై బయల్దేరారు. ఈ క్రమంలో పాలకుర్తి శివారులోని నయార పెట్రోల్ బంకు వద్ద గుర్తు తెలియని వాహనం వీరు ప్రమాణిస్తున్న ద్విచక్రవాహనాన్ని ఢీ కొట్టింది. తీవ్రంగా గాయపడిన వెంకన్న, అనిల్‌ను వారి స్నేహితులు జనగామ ఏరియా ఆస్పత్రికి తరలించి, ప్రథమ చికిత్స అందించారు. వైద్యుల సూచన మేరకు వరంగల్‌కు 108లో తరలిస్తుండగా మార్గం మధ్యలో అనిల్ మృతి చెందగా, వెంకన్న హనుమకొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మృతదేహాలను పోస్టు మార్టం నిమిత్తం వరంగల్ ఎంజీఎంకు తరలించగా, మృతుడు వెంకన్న తండ్రి భద్రు పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ విశ్వేశ్వర్, ఎస్సై తాళ్ల శ్రీకాంత్ తెలిపారు.

శోకసంద్రంలో చెరువుకొమ్ముతండా

పర్వతగిరి: మండలంలోని చెరువుకొమ్ముతండాకు చెందిన ఇద్దరు యువకులు ధరావత్ అనిల్, ధరావత్ వెంకన్నలు రోడ్డు ప్రమాదంలో మృతి చెందినట్లు తెలియడంతో తండాలో విషాదఛాయలు అలుముకున్నాయి. కాగా, మల్లారెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో అనిల్ బీటెక్ మొదటి సంవత్సరం, వాగ్దేవి ఇంజనీరింగ్ కళాశాలలో వెంకన్న బీటెక్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నారు. అనిల్ కుటుంబంలో ఇద్దరు అన్నదమ్ములు ఉండగా అనిల్ రెండో వాడు. వెంకన్న కుటుంబంలో ఒక చెల్లి వెంకన్న ఉండగా వెంకన్న మృతితో కుటుంబం శోకసంద్రంలో మునిగిపోయింది. అయితే ఎలాంటి చెడు అలవాట్లకు బానిస కాకుండా తండాలో మంచి పేరు సంపాదించుకున్న అనిల్, వెంకన్నలు దైవదర్శనం కోసం వెళ్లి మృతి చెందడంతో తండాలో ప్రతీ ఒక్కరు విలపించారు. వీరిద్దరు ఎలాంటి మత్తు పదార్థాలు, మందు అలవాటు లేకపోగా.. చదువుకునే వారిని ప్రోత్సహించేవారని, తండాలో జరిగే ఏ కార్యక్రమాలకైనా ముందుండే వారని తండా వాసులు గుర్తు చేసుకుని తల్లడిల్లిపోయారు.

చోరీ కేసులో వ్యక్తి రిమాండ్


వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ

రఘునాథపల్లి: జల్సాలకు అలవాటుపడి దొంగతనానికి పాల్పడిన వ్యక్తిని పోలీసులు వారం రోజుల వ్యవధిలోనే అరెస్ట్ చేసి, నిందితుడి నుంచి రూ.1,35,625 సొత్తును స్వాధీనం చేసుకున్నట్లు ఏసీపీ రఘుచందర్ తెలిపారు. జనగామ జిల్లా రఘునాథపల్లి మండల కేంద్రంలోని జనగామ రూరల్ సర్కిల్ కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో నిందితుడి అరెస్ట్ చూపి, వివరాలు వెల్లడించారు. మండలంలోని కోమళ్ల గ్రామానికి చెందిన వెల్పుగొండ అశోక్ తన తల్లి బుచ్చమ్మ కేన్సర్ వ్యాధితో బాధపడుతుండగా సికింద్రాబాద్ లాలాగూడ రైల్వే ఆస్పత్రిలో అడ్మిట్ చేసేందుకు ఇంటికి తాళం వేసి వెళ్లారు. తాళం వేసిన విషయాన్ని గుర్తించిన అదే గ్రామానికి చెందిన వెల్పుగొండ కృష్ణ ఇంట్లో చొరబడి బీరువాలో ఉన్న నగదుతోపాటు బంగారు, వెండి ఆభరణాలు అపహరించాడు.. ఈ నెల 10న ఆస్పత్రి నుంచి అశోక్ ఇంటికి చేరుకోగా దొంగతనం జరిగినట్లు గుర్తించి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీంతో రంగంలోకి దిగిన పోలీసులు విచ్చలవిడిగా డబ్బులు ఖర్చు చేస్తూ మద్యం సేవిస్తున్న వారిపై నిఘా పెట్టారు. ఈ తరుణంలో వెల్పుగొండ కృష్ణ అదే పద్ధతిలో అతిగా మద్యం సేవిస్తూ జల్సాలు చేస్తున్న తీరుపై పోలీసులకు అనుమానం వచ్చి విచారణ చేయగా, తానే దొంగతనానికి పాల్పడినట్లు ఒప్పుకున్నాడు. దీంతో ఆదివారం అరెస్ట్ చేశారు. నిందితుడి నుంచి రూ.68వేల నుంచి రూ.30వేలు, రూ.1,05,625 విలువ గల బంగారు, వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నామని, వాటిని కోర్టు ఆదేశాల మేరకు బాధితులకు అందజేస్తామని తెలిపారు. వారం రోజుల వ్యవధిలో దొంగతనం కేసును చాకచక్యంగా ఛేదించిన సీఐ సంతోష్, ఎస్సై వీరేందర్‌ను ఏసీపీ అభినందించారు. హెడ్‌కానిస్టేబుల్ బాస్కుల వెంకటయ్య, కానిస్టేబుల్ నవీన్‌రెడ్డి, కుమారస్వామి పాల్గొన్నారు.

ఎస్సీల అభివృద్ధికి రూ.38,700కోట్లు

- ఎస్సీ సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్


విలేకరులతో మాట్లాడుతున్న మంత్రి ఈశ్వర్, పక్కన ఎమ్మెల్యే సతీష్ కుమార్

భీమదేవరపల్లి: ఎస్సీలను పారిశ్రామికవేత్తలుగా చూడాలన్నదే సీఎం కేసీఆర్ లక్ష్యమని అందుకుగానూ ఎస్సీల అభివృద్ధి కోసం రూ.38,700 కోట్ల నిధులను కేటాయించినట్లు ఎస్సీ సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలంలోని గట్లనర్సింగపూర్‌లో ఓ ప్రైవేట్ కార్యక్రమానికి మంత్రి కొప్పుల ఆదివారం హాజరయ్యారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. గత ప్రభుత్వాల వైఫల్యాలతో ఎస్సీలు నేటికీ ఆర్థికంగా అభివృద్ధి చెందలేదన్నారు. ప్రత్యేక తెలంగాణ ఏర్పాటు అనంతరం ఎస్సీలను అన్ని రంగాల్లో అభివృద్ధి పర్చాలనే లక్ష్యంతో కేసీఆర్ దళిత బంధు, గురుకుల పాఠశాలలు, విదేశీ విద్యకు రుణసాయం, దళిత రక్షణ నిధి లాంటి అనేక కార్యక్రమాలను రూపొందించి అమలు చేస్తున్నట్లు చెప్పారు. ఈ ఏడాది ఎస్సీల అభివృద్ధి నిధికి రూ.21వేల కోట్లు, దళిత బంధుకు రూ.17,700కోట్లు కేటాయించినట్లు వివరించారు. హుజూరాబాద్ నియోజకవర్గంలోని 18వేల దళిత కుటుంబాలకు రూ.2వేల కోట్ల వ్యయంతో దళిత బంధు యూనిట్లు అందించామన్నారు. రాష్ట్రంలోని ప్రతి దళిత కుటుంబానికి దశల వారీగా దళిత బంధు పథకాన్ని అమలు చేసేందుకు తమ ప్రభుత్వం సిద్ధంగా ఉందని వివరించారు. తెలంగాణలో అమలవుతున్న పథకాలు ఇతర రాష్ట్రాల్లో సైతం అమలు కోసం అక్కడి ప్రజలు ఎదురుచూస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో హుస్నాబాద్ ఎమ్మెల్యే వొడితెల సతీష్‌కుమార్, హనుమకొండ జెడ్పీ చైర్మన్ మారెపల్లి సుధీర్‌కుమార్, ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ బండ శ్రీనివాస్, ఎంపీపీ జక్కుల అనిత, జెడ్పీటీసీ వంగ రవి ఉన్నారు.

హత్యచేసి ఆత్మహత్యగా చిత్రీకరణ

- భార్యఫిర్యాదుతో వెలుగులోకి..
- వివరాలు వెల్లడించిన సీఐ రంజిత్‌రావు


నిందితులను అరెస్టు చూపుతున్న పోలీసులు

మహాముత్తారం: జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాముత్తారం మండలంలోని కొర్లకుంట గ్రామానికి చెందిన బోద ధర్మయ్యను నెల క్రితం హత్య చేసి ఆత్మహత్యగా చిత్రీకరించిన నలుగురు వ్యక్తులను ఆదివారం అరెస్టు చేసినట్లు కాటారం సీఐ రంజిత్‌రావు ఆదివారం తెలిపారు. పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు.

ధర్మయ్య మద్యానికి బానిసై జనవరి 18న కొర్లకుంట గ్రామ శివారులోని టేకుతోటలో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడని తల్లి ఫిర్యాదుతో పోలీసులు కేసునమోదు చేసుకున్నారు. కొన్నిరోజుల తర్వాత ఆయన భార్య ధర్మయ్య ఆత్మహత్యపై అనుమానాలు ఉన్నాయని మరో ఫిర్యాదు చేయడంతో పోలీసులు పూర్తి విచారణ చేపట్టారు. ఈక్రమంలో వారి విచారణలో ఆసక్తికర విషయాలు వెలుగుచూశాయి. మద్యానికి బానిసైన ధర్మయ్య పాతకక్షలను దృష్టిలో పెట్టుకొని పొలం పనుల్లో నిమగ్నమైన గ్రామానికి చెందిన రాములు అతని భార్య రాజేశ్వరిపై గొడ్డలితో దాడి చేయడానికి వెళ్లాడు. గమనించిన రాములు దంపతులు మరో ఇద్దరితో కలిసి ధర్మయ్యను ఆయన మెడలోనే ఉన్న టవల్‌లో ఉరివేసి హత్యచేశారు. ఈనేపథ్యంలో ఎవరికీ అనుమానం రాకుండా సమీపంలోని టేకుతోటలో ఓ చెట్టుకు ధర్మయ్య మృతదేహాన్ని ఆయన లుంగీతోనే వేలాడదీసి ఆత్మహత్యగా చిత్రీకరించారు. అయితే ధర్మయ్య భార్య ఫిర్యాదుతో విచారణ చేపట్టిన పోలీసులు రాములు అతని భార్య రాజేశ్వరితో పాటు అతనికి సహకరించిన ఇద్దరు ఆత్కూరి వెంకటి, రాజును అరెస్టు చేసినట్లు వెల్లడించారు. సీఐ వెంట మహాముత్తారం ఇన్‌చార్జ్ ఎస్సై సుధాకర్‌తో పాటు పోలీస్ సిబ్బంది ఉన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE

PLOT FOR SALE

■ మామునూర్‌లో అభివృద్ధి చేసిన కుడా లేఅవుట్ 263, 228, 200 గజాలు ప్లాట్లకై సంప్రదించండి: సెల్: 9032111600. [W-775782]

■ HMDA Approved Open Plots for Sale at Ghatkesar, BibiNagar. Contact Cell: 9000182326 / 9705694440. [H-792739]

SERVICES

LOANS

■ హౌసింగ్, బిజినెస్, పర్సనల్, మార్టిగేజ్ & ఉద్యోగస్తులందరికి పర్సనల్ రుణాలు ఏ బ్యాంకులలో అయినా ఇప్పించబడును & IT Returns, GST License చేయబడును. పద్మావతి ఫైనాన్స్-WGL 9618767116 [W-775823]

WANTED

■ మా సంస్థలో పని చేయుటకు సెక్యూరిటీ గార్డ్స్, సూపర్‌వైజర్స్ అర్జెంటుగా కావలెను. 8 గం॥ 12 గం॥ డ్యూటీలు కలవు. జీతం: 12000-15000. సంప్ర॥ 9703637320. [W-1170522]

■ Computer Operators / Pharmacists / Supervisors & GNM Nurses required for Guardian Hospital - Mulugu "X" Road, Warangal. Cont: time 12 to 2. [WA-0195]

■ ప్రముఖ కృష్ణవేణి రెసిడెన్షియల్ జూనియర్ కాలేజ్, నక్కలగుట్ట, హన్మకొండలో కావలెను. (1) Asst. వంట మాస్టర్, (2) ఆటో ట్రాలీ డ్రైవర్, (3) ఆయాలు, (4) వాచ్‌మెన్ అర్జెంటుగా కావలెను. 9849610729. [WA-6496]

■ Wanted Sales Executive for Delicious Farms Chicken Outlets in Warangal Required Sales Related Experience in any Domain. Salary + Bonus. Age: 25-35 yrs. Timings: 8 AM - 7 PM. Cont: 8106112401 [W-775827]

■ వరంగల్‌లోని కిరాణం షాప్ నందు పని చేయుటకు 3 సం॥ల అనుభవం కల్గిన (స్త్రీ/పు) కావలెను. వరంగల్ లోకల్ వారు మాత్రమే సంప్రదించండి. యువరాజ్ కిరాణం, వరంగల్. 9490133696 [W-775830]

■ ప్రముఖ సంస్థ నందు మీ ఇంటి దగ్గర ఉంటూ పార్ట్ టైం/ఫుల్‌టైం పోస్టల్ కవర్లపై అడ్రస్‌లు వ్రాయుటకు స్త్రీ/పురుషులు కావలెను. నెలకు 10-15వేలు వరకు సంపాదన. ఫ్రీ బుక్‌లెట్ కొరకు 9059509586 [G-781830]

■ స్టార్ హోమ్ కేర్ Hyd. లో వృద్ధులకు, పేషంట్లకు సేవ చేయుటకు. బేబికేర్, ఇంటి / వంట పనికి స్త్రీ/పు, లేడీ టెలీకాలర్స్ కావలెను. జీతం: 16,000/- నుండి 25,000/- రూం + భో. ఫ్రీ. ఫోన్: 7801099881, 8639828228 [V-775156]

■ త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకోవడానికి వర్కర్స్, నర్సులు, కావలెను, ఫ్రీ వసతి+ భోజనం, జీ: 18 k ఏజెంట్స్ కమీషన్ 3k ఫోన్: 7569955551, 9848571888. [H-786836]

4 లైన్ల క్లాసిఫైడ్ ప్రకటన 260/- రూ॥ అదనపు లైను 60/- రూ॥లు మాత్రమే 5% GST అదనము

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి
హన్మకొండ 9010144453
వరంగల్ 9705748198
నర్సంపేట 9505507558
జనగామ 9951602871
మహబూబాబాద్ 9010144453
జయశంకర్ భూపాలపల్లి 9705748198

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.